సాక్షి నల్లగొండ

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



గోదావరి నీళ్లతో సస్యశ్యామలం

గోదావరి నీళ్లతో ఆలేరు సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 586.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 57,220 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 42,817 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,151 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6,253 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 4,613 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 455.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 455.27 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

- పరిశ్రమల రసాయనాలు, మానవ వ్యర్థాలతో విషతుల్యం
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- ఇక్కడ పండించిన పంటలు తిన్నా, నీటిని తాగినా ఆరోగ్య సమస్యలు
- కీళ్లు, చర్మ, మూత్రపిండాలు, గర్భకోశ వ్యాధుల బారిన జనం
- పశువుల పాలూ కలుషితమే
- చేతివృత్తులపైనా ప్రభావం

పునరుజ్జీవంతోనే మనుగడ

మురికి కూపంగా మూసీ నది



భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి వద్ద కాలుష్యపు నురగలు కక్కుతున్న మూసీనది

జీవంపోసిన జీవనదే.. జీవనానికి ముప్పుగా పరిణమించింది. స్వచ్ఛమైన నీటిని అందిస్తూ వ్యవసాయం, పాడి, మత్స్య సంపదకు నెలవైన మూసీ.. విషతుల్యంగా మారింది. ఒకప్పుడు మూసీలో రూపాయి బిళ్ల వేస్తే స్పష్టంగా కనిపించేదని నాటితరం పెద్దలు చెబుతుంటారు. 1930 వరకు హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల దాహార్తి తీర్చింది. గడిచిన 30 సంవత్సరాలుగా రసాయన పరిశ్రమలు, మానవ వ్యర్థాలు మూసీ పరీవాహకంలో జీవన విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి.

-సాక్షి, యాదాద్రి, శాలిగౌరారం

కృష్ణా నదికి ఉపనదిగా ఉన్న మూసీ అసలు పేరు ముచుకుందా. ముచుకుందుడు అనే రాజర్షి పేరు మీదుగా ముచుకుందా నదిగా పేరు వచ్చింది. అది కాలక్రమేణా మూసీ నదిగా మార్పు చెందింది. మూసీనది హైదరాబాద్‌కు పశ్చిమ వైపున 90 కిలోమీటర్ల దూరంలో నేటి వికారాబాద్ జిల్లా(నాటి రంగారెడ్డి జిల్లా)లోని అనంతగిరి కొండల్లో పుట్టింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల మీదుగా 240 కిలో మీటర్ల దూరం ప్రవహించి నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి (నాటి వజీరాబాద్) వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది.

- మూసీ పరీవాహక ప్రాంత (బేసిన్) వైశాల్యం 4,329 చదరపు మైళ్లు. (ఇది కృష్ణానది వైశాల్యంలో 4.35 శాతం)

మూసీ ప్రాజెక్టు కింద 30వేల ఎకరాల ఆయకట్టు

కేతేపల్లి : సూర్యాపేట మండలం సోలిపేట వద్ద నిర్మించిన మూసీ ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వల పరిధిలో ప్రస్తుతం 30వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. కుడికాల్వ నల్లగొండ జిల్లా పరిధిలో 24 గ్రామాల్లో 14,770 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఎడమ కాల్వ కింద సూర్యాపేట జిల్లాలోని 18 గ్రామాల్లో 15,230 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతోపాటు 40 చెరువులు, కుంటలను మూసీ నీటితో నింపుతుండటంతో అదనంగా వేల ఎకరాలకు సాగునీరందుతుంది. వేలాది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. మూసీ జలాలు కలుషితం కావడం వల్ల మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గినప్పుడు రసాయనాలు నీటిలో తేలుతాయి. నీరు పచ్చగా మారుతుంది.



మూసీ ప్రాజెక్టు

గతంలో సూర్యాపేటకు తాగునీరు

ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పటి నుంచి సూర్యాపేట పట్టణానికి రోజూ 10 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేసేవారు. మూసీ నీరు కాలుష్యంగా మారటంతో పదేళ్ల నుంచి పంపింగ్ నిలిపివేశారు. పాలేరు రిజర్వాయర్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

మూసీనదిపై ఆనకట్టలు, చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు కలిపి 20 ఉన్నాయి. వాటిలో 17 ఆనకట్టలు, రెండు చెక్‌డ్యాంలు, ఒక ప్రాజెక్టు(మూసీ) ఉన్నాయి.

అంతమైన మత్స్య సంపద

మూసీలో గతంలో చందమామ, పరకలు, ఇంగిలీకం, ఒడిపి, ఉప్పు దొంతులు, మార్పులుగాళ్లు, బంగారుతీగ, పాపర్లు తదితర 16 రకాల చేపలు లభించేవి. ప్రస్తుతం వాటి జాడ లేదని మత్స్యకారులు చెబుతున్నారు.



మూసీ రిజర్వాయర్‌లో చేపలు పడుతున్న మత్స్యకారులు

యాదాద్రి జిల్లాలోనే 63 కిలోమీటర్లు

మూసీ నది ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోనే 63 కిలో మీటర్ల మేర ప్రవహిస్తోంది. ఈ జిల్లాలో మూసీ నీటితో లక్ష ఎకరాలకు పైగా వరి సాగవుతోంది.

మూసీలో కలిసే వాగులు

ఆలేరు, జనగామ (దేవరుప్పల) వాగులు తిరుమలగిరి మండలం తాటిపాముల వద్ద కలిసి బిక్కేరుగా మారింది. బిక్కేరు వాగు అనంతరం మీదుగా ప్రవహించి జాజిరెడ్డిగూడెం సమీపంలో తుంగోనిగూడెం వద్ద మూసీనదిలో కలుస్తుంది.

అన్నీ దుష్పరిణామాలే..

మూసీ పరీవాహక ప్రాంతంలో వరి, కూరగాయల సాగుతో పాటు పచ్చగడ్డి పెంచుతున్నారు. మూసీ నీటి ఆధారితంగా సాగు చేస్తుండడతో దిగుబడి తక్కువగా వస్తుంది. కూరగాయలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. పచ్చిగడ్డి తిన్న పశువుల పాలు కూడా కలుషితమే. ఇక్కడి నీటిని నేత కార్మికులు వస్త్రాల రంగులద్దకానికి వినియోగిస్తే రంగుల నాణ్యత దెబ్బతింటోంది. ఈ ప్రాంతంలోని నీటిని తాగితే జనం కీళ్లు, చర్మ, మూత్రపిండాలు, గర్భాకోశ వ్యాధుల బారిన పడుతున్నారు.

అత్యంత విషతుల్యంగా..



మూసీ రిజర్వాయర్‌లో పేరుకుపోయిన రసాయనాలు

1980 దశకం నుంచే మూసీలో పారిశ్రామిక వ్యర్థాలు కలవడం మొదలైంది. అప్పట్లోనే రోజుకు 350 మిలియన్ లీటర్ల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయని అంచనా వేశారు. ప్రమాదకరమైన రసాయనాలతో పాటు అనేక రకాల వ్యర్థాలు కలిసిపోవడంతో అత్యంత విషతుల్యంగా మారింది.

- ప్రపంచంలోని కలుషిత నదులలో మూసీ 22వ స్థానంలో నిలిచింది. (2022 గణాంకాల ప్రకారం)

ఇలా చేయవచ్చు..

మూసీ నది వెంట ప్రతి 20కిలో మీటర్లకు ఒక చెక్ డ్యామ్ నిర్మించాలి. చెక్ డ్యామ్ నిర్మించిన ప్రతి దగ్గర రెండు అతిపెద్ద సింటెక్స్‌లను ఏర్పాటు చేయాలి. మొదటి దశలో ఒక ట్యాంక్‌లో నీళ్లు పంపి కెమికల్ వేయాలి. సూక్ష్మ జీవులు చనిపోతాయి. హెవీ మెటల్స్ కరిగిపోతాయి. రెండో దశలో నీటిని న్యూట్రల్ చేస్తాం. ఆ నీటితో పంటలు పండించవచ్చు. చేపలు పెంచుకోవచ్చు. వ్యర్థ పదార్థాలను ఎరువుగా వాడుకోవచ్చు. నది పరీవాహక ప్రాంతం వెంట తాగు నీటిగా వాడుకోవచ్చు.

ఎస్టీపీల ద్వారా శుద్ధి ఉత్తమాట



సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ల ద్వారా మూసీ మురికిని శుద్ధి చేయడం ఉత్తమాట. వ్యర్థాలను తొలగించడానికి గతంలో ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వృథా అయ్యాయి. మూసీ నీటిలో ఉన్న మైక్రో ఆర్గానిజమ్స్ (సూక్ష్మ జీవులు) ప్రజల ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు చూపిస్తాయి. ఎస్టీపీలలో క్లోరిన్ లిక్విడ్‌ను పంపించినప్పటికీ వంద శాతం సూక్ష్మజీవులను చంపలేం. హైడ్రో కార్బన్లతో పాటు అమోనియా, నైట్రోజన్, పాస్పరస్, హెవీ మెటల్స్ అయిన జింక్, కాపర్, మెర్క్యురీ, కోబాల్ట్ వంటి వాటిని తొలగించలేం. ఎస్టీపీల ద్వారా చంపేది 90శాతమే. పది శాతం సూక్ష్మ జీవులు నీటిలో చేరి ప్రజలను పలు రోగాల పాలుచేస్తున్నాయి.

-ప్రొఫెసర్ చిన్న వెంకటేశ్వర్లు, వాతావరణ శాస్త్రవేత



భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి కత్వ



పోచంపల్లి చెరువు ఆయకట్టులో వరి పంట సాగు

వరి దిగుబడి వస్తలేదు



మూసీ ఆయకట్టులో వరి దిగుబడి సరిగా వస్తలేదు. ధాన్యంలో తాలు ఎక్కువగా ఉండడంతో పాటు నల్లగా మారుతుంది. ప్రభుత్వం మూసీ శుద్ధికి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

-పల్లెబాటి నర్సింహ, రైతు

తాటికల్లు రుచిగా ఉంటలేదు



మూసీ నీరు భూగర్భంలోకి ఇంకడంతో తాటి కల్లు రుచిగా ఉంటలేదు. దీంతో ఇక్కడ కల్లు తాగే వారి సంఖ్య తగ్గుతోంది. గీత కార్మిక కుటుంబాలు నష్టపోతున్నాయి. అంతేకాకుండా తాటిచెట్లకు చీడపడుతుంది.

-నూనెముంతల దేవయ్య, గీతకార్మికుడు

చర్మ వ్యాధులు వస్తున్నాయి



30 ఏళ్లుగా మూసీ నీళ్లతోనే వరి సాగు చేస్తున్నాం. నాట్లు వేసినప్పుడు, కలుపు తీసిన సమయంలో దురద, మంటలు వస్తున్నాయి. మూసీ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి పూనుకోవడం అభినందనీయం. ప్రభుత్వానికి రుణ పడిఉంటాం.

-ఉట్కూరి సత్తమ్మ, మక్తా అనంతారం

కలెక్టర్ ఇంటికి స్టిక్కరింగ్



కలెక్టర్‌ను వివరాలు అడుగుతున్న ఎన్యుమరేటర్

నల్లగొండ టూటౌన్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బృందం గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్ ఆయేషా హమీరా.. కలెక్టర్ త్రిపాఠి ఇంటి నంబర్, ఇంటి యజమాని వివరాలను అడిగి తెలుసుకొని స్టిక్కర్‌పై నమోదు చేసి కలెక్టర్ నివాస గృహం గోడకు అతికించారు. వార్డు, బ్లాక్ తదితర కోడ్ నంబర్లు నమోదు చేసుకున్న అనంతరం పూర్తి వివరాలను ఎప్పుడు సేకరిస్తారని కలెక్టర్ ఎన్యుమరేటర్‌ను ప్రశ్నించగా.. ఈనెల 9వ తేదీ నుంచి మరోసారి ఇళ్లను సందర్శించి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్‌తో ఉన్న స్టిక్కర్, మ్యాప్, ఐడీకార్డ్, ఇతర ఫారాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, సూపర్‌వైజర్ రోహిత్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన జడ్జిని కలిసి కలెక్టర్



జిల్లా జడ్జి నాగరాజుకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ): జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజును గురువారం జిల్లా కోర్టులోని ఆయన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పత్తి, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



కొంపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మునుగోడు: పత్తి, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం మునుగోడులోని కార్తికేయ కాటన్ మిల్లులోని సీసీఐ, కొంపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కేవలం రైతుల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని, దళారులు తీసుకొచ్చింది కొనొద్దన్నారు. నిబంధనల ప్రకారం రైతులు తెచ్చిన పత్తి, వరి ధాన్యాన్ని వెంటనే కొనాలన్నారు. పత్తి రైతులకు రెండు, మూడు రోజుల్లో నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయదేవి, చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి, తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయభాస్కర్, చండూరు మార్కెట్ కార్యదర్శి కె.రవి, సీసీఐ కేంద్రం ఇన్‌చార్జి నీమ్‌జే, ఆర్ఐలు ఏ.రామచంద్రయ్య, నాగరాజు ఉన్నారు.

గ్రామాల్లో నివాసముంటేనే కుటుంబంగా గుర్తించాలి

అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మునుగోడు మండం కొంపల్లి, చీకటిమామిడి గ్రామాల్లో సమగ్ర కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివాసం ఉండేవాళ్లను మాత్రమే కుటుంబంగా గుర్తించి వారి ఇళ్లకు స్టిక్కర్లు అంటించాలన్నారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శ్రీపాల్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరం

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఫణికుమార్

నల్లగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల బిల్లులను డిసెంబర్ 16లోగా పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గురుకులాలకు టైం స్కేల్ అమలు చేయాలని మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. మాజీ అధ్యక్షుడు భిక్షంగౌడ్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ అభ్యర్థి గెలుపునకు ఈసారి అందరూ సమష్టిగా కృషి చేస్తారన్నారు. పీఆర్‌టీయూపై తీన్‌మార్ మల్లన్న విషం చిమ్ముతున్నారన్నారు. బీసీలు.. రెడ్లకు ఓటేయవద్దంటూ పీఆర్‌టీయూలో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస్, శంకరయ్య, గాదె వెంకట్‌రెడ్డి, తిరందాసు సత్తయ్య, యూసుఫ్‌పాషా, నాగయ్య, వీరమల్ల శ్రీను, రమణ, కత్తుల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు నూరు శాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలస్వామి

నల్లగొండ: విద్యుత్ బిల్లులు పెండింగ్ లేకుండా ప్రతినెలా నూటికి నూరు శాతం వసూలు చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ బాలస్వామి అన్నారు. గురువారం నల్లగొండలోని పాలకేంద్రం వద్ద ఉన్న విద్యుత్ సమావేశ మందిరంలో నల్లగొండ జిల్లా ఎస్ఈ, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఎస్ఏఓలు, ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. వేసవిలో బ్రేక్ డౌన్లు రాకుండా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై దృష్టి సారించాలన్నారు. 33 కేవీ లైన్ల విషయంలో అప్రమత్తంగా ఉండి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహజ్యోతి అర్హులకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్‌డేట్ చేస్తూ వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈఈ, ఏడీఈలు పాల్గొన్నారు.

డీపీఎం పోస్టుకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఖాళీగా ఉన్న జిల్లా ప్రోగ్రామ్‌మేనేజర్ (డీపీఎం) పోస్టుకు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 8న శుక్రవారం నంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎం హోదాలో రెండోసారి..

నేడు యాదాద్రి జిల్లాకు రేవంత్‌రెడ్డి రాక

- సంగెం బ్రిడ్జి నుంచి భీమలింగం కత్వవరకు మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్ర
- రైతులు, చేతివృత్తిదారులతో మమేకం
- యాదాద్రీశుడి సన్నిధిలో కుటుంబ సమేతంగా పూజలు



సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టనున్న మూసీ పునరుజ్జీవన సంకల్పయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద నుంచి మూసీ వెంబడి భీమలింగం కత్వవరకు 2.5 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేయనున్నారు. తిరిగి అక్కడినుంచి సంగెం వరకు పాదయాత్రగా వస్తారు. ఈ క్రమంలో మూసీ పరీవాహక ప్రాంత రైతులు, చేనేత, మత్స్యకార్మికులతో పాటు వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడుతారు. మూసీ కలుషిత జలాల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటారు. ఈ సందర్భంగా సంగెం వద్ద నిర్వహించే సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 9.20కి యాదాద్రి కొండ దిగువన ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్తారు. తిరిగి ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి పలువురు మంత్రులతో కలిసి యాదాద్రి కొండపైకి చేరుకుంటారు. అక్కడ విష్ణు పుష్కరిణిలో సీఎం, కుటుంబసభ్యులు స్నాన సంకల్ప పూజలో పాల్గొంటారు. ఆ తరువాత అఖండ దీపారాధన చేసి మొక్కులు తీర్చుకుంటారు. అక్కడి నుంచి తూర్పు రాజగోపురం ద్వారా ప్రధానాలయంలోకి వెళ్తారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే ముఖమండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొంటారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయనున్నారు. అక్కడి నుంచి సీఎం, కుటుంబ సభ్యులు అద్దాల మండపం చేరుచేరుకుని అధికారులు అందజేసే శ్రీస్వామి వారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అనంతరం తిరిగి ప్రెసిడెన్షియల్ సూట్ వెళ్తారు.



వలిగొండ మండలం సంగెం వద్ద ఏర్పాట్లను మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డికి వివరిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



యాదాద్రి కొండ దిగువన విష్ణు పుష్కరిణికి వెళ్లే దారిని పరిశీలిస్తున్న సీఎం సెక్యూరిటీ వింగ్ అధికారులు, కలెక్టర్, డీసీపీ, ఈఓ

వైటీడీఏ అధికారులతో సమీక్ష

ప్రెసిడెన్షియల్‌సూట్‌లో 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు వైటీడీఏ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. యాదాద్రి పెండింగ్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం రోడ్డు మార్గంలో భువనగిరి మీదుగా సంగెం చేరుకుంటారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం, పార్టీ నాయకత్వం పటిష్ట ఏర్పాట్లు చేసింది.

మొదటిసారి మార్చి 11న

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు రెండోసారి వస్తున్నారు. ఈ ఏడాది మార్చి 11న కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అదే రోజు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడంతో ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. తిరిగి శుక్రవారం మరోసారి జిల్లాకు వస్తున్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్..

- ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట్ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రికి బయలుదేరుతారు.
- 9.20కి యాదాద్రి కొండ దిగువన ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని అక్కడినుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్తారు.
- 9.30 నుంచి 10గంటల వరకు ప్రెసిడెన్షియల్ సూట్‌లో ఉంటారు.
- 10 గంటలకు ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి యాదాద్రి ఆలయానికి బయల్దేరుతారు.
- 10.05 నుంచి 11.15 గంటల వరకు ప్రధానాలయంలో ఉంటారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- 11.20కి ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకుంటారు.
- 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ, దేవస్థానం అధికారులతో సమావేశమై ఆలయ అభివృద్ధిపై సమీక్షిస్తారు.
- ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు భోజన విరామం.
- 1.30కి ప్రెసిడెన్షియల్ సూట్ నుంచి బయలుదేరి సంగెం చేరుకుంటారు.
- 2.10 నుంచి 3 గంటల వరకు సంగెం బ్రిడ్జి పైనుంచి మూసీ వెంబడి భీమలింగం కత్వ వరకు 2.5 కిలో మీటర్లు పాదయాత్ర చేస్తారు. తిరిగి అక్కడి నుంచి సంగెం వరకు పాదయాత్రగా వస్తారు. అక్కడ ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగిస్తారు.
- 5 గంటలకు సంగెం నుంచి తిరిగి హైదరాబాద్‌కు రోడ్డుమార్గంలో బయలుదేరి వెళ్తారు.

క్లుప్తంగా

గుండ్లపల్లి గ్రామంలో కొండచిలువ ప్రత్యక్షం

● కర్రలతో కొట్టి హతమార్చిన గ్రామస్తులు


గ్రామస్తుల చేతిలో హతమైన కొండచిలువ

మఠంపల్లి: మండలంలోని గుండ్లపల్లి గ్రామం పాత కాలనీలో 8 అడుగుల కొండచిలువ ప్రత్యక్షమైంది. కొంతమంది గ్రామస్తులు బుధవారం రాత్రి పొలాల వద్దకు వెళ్తుండగా.. అటవీ ప్రాంతం నుంచి పాత కాలనీలోకి వస్తున్న కొండచిలువ వారి కంటపడింది. దీంతో ఆందోళన చెందిన గ్రామస్తులు దానిని కర్రలతో కొట్టి హతమార్చారు. కొండచిలువ గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు రాత్రి సమయాల్లో పొలాల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అబ్జర్వర్‌గా చింతలపాలెం జెడ్పీహెచ్ఎస్ పీడీ


ఉస్మాన్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్‌-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు అబ్జర్వర్‌గా చింతలపాలెం జెడ్పీహెచ్ఎస్ పీడీ ఉస్మాన్ ఎంపికయ్యారు. గురువారం ఆయనను హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు డి. నారాయణరావు, బి. శ్రీనివాసాచారి, పి. శీను, ఎస్. సురేష్, ఫాతిమా, జ్యోతి, నిర్మల కుమారి, పద్మావతి, సురేష్, షాహిన్ బేగం, సరిత, విజయ, సీఆర్పీ నాగయ్య తదితరులు అభినందించారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి


ఢిల్లీ చిలుకమ్మ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: మండలంలోని జైకేసారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దబావిగూడేనికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు ఢిల్లీ చిలుకమ్మ(98) వయోభారంతో గురువారం మృతి చెందింది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో పాటు స్వాతంత్య్రోద్యమంలో ఆమె తన భర్త చంద్రారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిలుకమ్మ మృతదేహానికి బీఆర్ఎస్ కార్మిక విభాగం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మలేషియాలో డప్పు ప్రదర్శనకు ఆహ్వానం


డప్పు ప్రదర్శనకు ఎంపికైన అమరవరపు సతీష్

గరిడేపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మలేషియాలోని తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమంలో డప్పు ప్రదర్శన ఇచ్చేందుకు గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌కు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా గురువారం సతీష్‌ను పలువురు అభినందించారు.

గోదావరి నీళ్లతో ఆలేరు సస్యశ్యామలం

● మూడు నెలల్లో గంధమల్ల రిజర్వాయర్ పనులను ప్రారంభిస్తాం

● రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


జంగపల్లి వద్ద గోదావరి జలాలు విడుదల చేసి పూజలు చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్: గోదావరి నీళ్లతో ఆలేరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలం జంగపల్లి గ్రామం వద్ద మల్లన్నసాగర్ నుంచి ఓటీ-2 కెనాల్‌కు వచ్చిన గోదావరి జలాలను డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ద్వారా యాదగిరిగుట్ట మండలంలోని చెరువులోకి వదిలి గురువారం మంత్రులు వదిలారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఇది పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు కలుషిత జలాలు, ఫ్లోరైడ్ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కరువు నేలలో గోదావరి పరవళ్లు తొక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎగువన మల్లన్నసాగర్ ఉన్నా ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందకపోవడం గత ప్రభుత్వం వైఫల్యమన్నారు. అదే విధంగా రూ.210 కోట్లతో ఆలేరు ప్రాంతానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడానికి పనులు త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఇటీవల వర్షాలకు వరంగల్, ఖమ్మం కొట్టుకుపోయిన తరుణంలో ఆలేరు ప్రాంతంలో నీళ్లు లేకపోవడం ఆశ్చర్యమేసిందన్నారు. గోదావరి నీళ్లతో ఆలేరు ప్రాంతంలో పంటలు మంచిగా పండాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. మల్లన్న సాగర్ నుంచి ఉస్మాన్ సాగర్‌ను కూడా నింపే ప్రయత్నం చేస్తామన్నారు. అంతకుముందు గోదావరి నీళ్ల ద్వారా సాగు నీరు అందించడానికి కృషిచేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆలేరు ప్రజల తరఫున ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యరెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు


ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

యాదగిరిగుట్ట, వలిగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అధికార యంత్రాంగం, పార్టీ నాయత్వం పటిష్ట ఏర్పాట్లు చేసింది. సీఎం పాదయాత్ర చేయనున్న ప్రాంతంలో ప్రధాన రోడ్డు నుంచి ధర్మారెడ్డి కాల్వ వరకు మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. మూసీ వంతెనకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ తెలిపారు. అదే విధంగా యాదాద్రిలో ఏర్పాట్లను సీఎం సెక్యూరిటీ వింగ్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేష్‌చంద్రతో కలిసి పరిశీలించారు. కొండపైన గల విష్ణు పుష్కరిణి, అఖండ దీపారాధన ప్రాంతాలతో పాటు తూర్పు రాజగోపురం, ప్రధానాలయం, గర్భాలయం, తిరువీధులు, మాడ వీధులు, బస్టాండ్ ప్రాంతాలు, కొండపైన అతిథిగృహం, ప్రెసిడెన్షియల్ సూట్, హెలిపాడ్ స్థలాలను పరిశీలించారు. ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు వివరించారు.

బందోబస్తుపై సమీక్ష

కలెక్టర్, డీసీపీ, దేవస్థానం ఈఓతో పాటు పలువురు ఉన్నతాధికారులతో సీఎం సెక్యూరిటీ వింగ్ ఆఫీసర్ సమీక్ష నిర్వహించారు. పోలీసు బందోబస్తు, ఆలయంలో, లక్ష్మీ పుష్కరిణి, అఖండ దీపారాధన వద్ద, ఆశీర్వచనం సమయంలో అర్చకులు ఎంత మంది ఉండాలనే అంశాలపై చర్చించారు.

ఆలయమంతా శుభ్రం

సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వస్తున్న సందర్భంగా ప్రధానాలయాన్ని, మాడ వీధులను అరటి తోరణాలు, పూల అలంకరణలో ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు స్వాగత ఏర్పాట్లు చేశారు.

పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్, సూపర్‌వైజర్ సస్పెన్షన్

మోత్కూరు: మదర్ డెయిరీ పరిధిలోని మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రానికి సంబంధించి 'పాల లెక్కల్లో తేడాలు' శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితం కాగా.. పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ వై. ఎల్లయ్య, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్ చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ గురువారం మదర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ బి. కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రాన్ని, ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి పాల సొసైటీ కేంద్రాన్ని మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రంలో వాస్తవం కంటే అదనంగా పాలు సేకరించినట్లు రికార్డులు నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు వారు గుర్తించి మేనేజర్, సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం మేనేజర్ ఎల్లయ్య, సూపర్‌వైజర్ చంద్రయ్య అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. మేనేజర్, సూపర్‌వైజర్‌తో పాటు మరో సూపర్‌వైజర్ శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఇద్దరినే సస్పెన్షన్ చేస్తూ శ్రీనివాస్‌ను తప్పించడం మదర్ డెయిరీ ఉద్యోగుల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఫ్లెక్సీలతో రైతుల నిరసన


ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న రైతులు

వలిగొండ: మూసీనది పునరుజ్జీవ పాదయాత్ర కోసం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం రానున్న నేపథ్యంలో గురువారం ఆ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు ఫ్లెక్సీలతో నిరసన వ్యక్తం చేశారు. 'మాకు రైతు బంధు రాలేదు.. మీరు మా ఊరికి రాకున్నా పర్వాలేదు' అంటూ రాసి ఉన్న ఫ్లెక్సీలను సంగెం గ్రామానికి చెందిన రైతులు జక్కల వెంకటేష్, సురకంటి లింగారెడ్డి తమ వ్యవసాయ పొలంలో ప్రదర్శించి నిరసన తెలిపారు.

గౌతమికి మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం


గౌతమికి ఆర్థికసాయం అందజేసిన తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన సిగ గౌతమి మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, తాతయ్య, నాయనమ్మ వద్ద ఉంటున్న గౌతమి ఎంబీబీఎస్ ఫీజు కట్టేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితం కాగా.. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ స్పందించి ఆమెకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో గౌతమి ఉన్నత చదువులు చదివేందుకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కష్టకాలంలో తనను ఆదుకున్న గాదరి కిశోర్‌కు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని గౌతమి ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో తునికి సాయిలు, కొండగడుపుల నాగయ్య, హరీష్ యాదవ్, సతీష్, మధు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి చేయూత


సానియాకు ఆర్థికసాయం అందజేస్తున్న హంస ఫౌండేషన్ బాధ్యులు

రామన్నపేట: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి, ఫీజు చెల్లించడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎండీ సానియాకు హంస ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డ్ టీచర్ చెరుకు లక్ష్మీసుధాకర్ రూ.10వేలు ఆర్థికసాయం ప్రకటించారు. గత నెల 27వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ×పేదింటి విద్యాకుసుమం॰ కథనానికి స్పందించి హంస ఫౌండేషన్ బాధ్యుడు ఎస్‌కే చాంద్ ద్వారా గురువారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కూనూరు శ్రీనివాస్‌గౌడ్, ఎండీ లతీఫ్, ఎజాజ్, బొడ్డుపల్లి రాజు, కందుల నర్సింహ, ఎండీ జానీపాష, మల్లం సైదులు, మాంద్ర రామచంద్రం, కూనూరు అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. యువకుడి దుర్మరణం


నవీన్ (ఫైల్)

వలిగొండ: బైక్‌పై వెళ్తున్న యువకుడిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి చెందిన ఎగ్గె నవీన్ (24) భువనగిరిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా.. టేకులసోమారం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

న్యాయం చేయాలని మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు


మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట అనిత

తుంగతుర్తి: తన భర్త ఆత్మహత్యకు కారకులైన వారిని పోలీసులు అరెస్ట్ చేయకపోవడంతో తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గురువారం తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన తాడూరి అనితతో పాటు ఆమె బంధువులు హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తన భర్త తాడూరి కృష్ణ ఆత్మహత్య చేసుకుని 20రోజులకు పైగా అవుతుందని, ఆయన హత్యపై పలు అనుమానాలు ఉన్నాయని తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని అనిత ఆరోపించారు. జిల్లా అధికారులను కలిసి వేడుకున్నా ఫలితం లేదన్నారు. తన భర్త ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్ట్ చేసి తమకు న్యాయం జరిగేలా పోలీసులు చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువుల ధర్నా


దేవరకొండ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నివాసముంటున్న ఆవంచ శేఖరాచారి(44) బంగారం పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయ్యప్ప మాల ధరించేందుకు గాను బుధవారం బైక్‌పై తన కుమారులతో కలిసి కల్వకుర్తి నుంచి దేవరకొండకు బయల్దేరాడు. దేవరకొండ పట్టణంలోని అయ్యప్ప దేవాలయం సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శేఖరాచారిని స్థానికులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

శేఖరాచారి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న దేవరకొండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


నర్సింహ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్తాపూర్ గ్రామానికి చెందిన బద్దం నర్సింహ(34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నర్సింహకు పదేళ్ల క్రితం ఇదే మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన తన మేనమామ కుమార్తెతో వివాహం జరిగింది. వీరికి సంతానం కలగకపోవడంతో ఓ అమ్మాయిని దత్తత తీసుకున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో ఏడాది క్రితం నర్సింహ భార్య తన పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు పెద్ద మనుషుల మధ్య పంచాయితీ పెట్టించినా ఆమె కాపురానికి రాకపోవడంతో ఇటీవల పెద్దమనుషుల మధ్య విడాకుల కాగితాలు రాసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన నర్సింహ మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అనంతరం తన గదిలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. గురువారం ఉదయం 7 గంటలైనా నర్సింహ నిద్రలేవకపోయేసరికి అతడి తండ్రి భిక్షపతికి అనుమానం వచ్చి తలుపులు విరగ్గొట్టి లోనికి వెళ్లిచూడగా నర్సింహ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని పోచంపల్లి ప్రభుత్వం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే నర్సింహ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

● మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్


బోధనేతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మహాత్మగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూలో నిర్వహించిన క్రీడా బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ తరఫున విద్యార్థులు 34 క్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారని, అదనంగా మహిళలకు జిమ్నాస్టిక్స్, సాఫ్ట్‌బాల్ చేర్చినట్లు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల క్రీడలను నిర్వహించాలని తీర్మానించారు. యూనివర్సిటీ పరిధిలోని ప్రతి కళాశాలలో క్రీడా సదుపాయాలు కల్పించాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి యూనివర్సిటీలో డీపీఈడీ కోర్సును నూతనంగా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నందున అన్ని స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఎంజీయూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, సీఓఈ ఉపేందర్‌రెడ్డి, పీడీలు మురళి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రావు, రవినాయక్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బంది నైపుణ్యాలు పెంచుకోవాలి

ఎంజీయూలో బోధనేతర సిబ్బంది మారుతున్న పరిస్థితుల కనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం బోధనేతర సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ నిర్వహణలో బోధనేతర సిబ్బంది పాత్ర కీలకమన్నారు. కొత్త అంశాలు తెలుసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ సలీం ఫాతిమా, డిప్యూటీ రిజిస్ట్రార్ రషీద్, మిర్యాల రమేష్, ప్రశాంతి, అరుణ ప్రియ, సుధారాణి, ప్రేమ్‌సాగర్, ఎంవీఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టపల్లి క్షేత్రానికి చేరకోనున్న పాదయాత్ర

మఠంపల్లి: చెన్నైకి చెందిన స్వాతీ నక్షత్ర మహాయజ్ఞ ట్రస్టు పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ మహా సంకల్పిత పాదయాత్ర శుక్రవారం తెల్లవారుజామున కోదాడలో ప్రారంభమై సాయంత్రానికి మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి చేరుకుంటుందని ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నైకి చెందిన ముక్కూరు లక్ష్మీనరసింహాచారియర్ స్వామి 25 ఏళ్ల కిందట ఈ పాదయాత్రను మట్టపల్లి ఆలయ అనువంశిక చైర్మన్ దివంగత చెన్నూరు నరసింహారావు, ఆలయ పెద్దల సహకారంతో ప్రారంభించారని తెలిపారు. నాటి నుంచి ప్రతి ఏడాది నిర్వహించే ఈ పాదయాత్రకు చెన్నై నుంచి ముక్కూరు స్వామి భక్తులు వస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బొమ్మలరామారం(తుర్కపల్లి): తుర్కపల్లి మండలం మాదాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సౌజన్యంతో మాదాపూర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్‌కు దీటుగా అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలు ఎదగాలని, ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి తీసుకురావాలనే ఆకాంక్షతోనే ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేసి ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే తన కలను సాకారం చేస్తానన్నారు. మాదాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థులు అడ్మిషన్ల కోసం పోటీపడేలా చూడాలని హెడ్మాస్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, ఎజీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మిబాయి, ఎంఈఓ మాలతి, ఎస్ఐ తక్యూద్దీన్, వడ్డే జానయ్య, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పబ్బ చంద్రశేఖర్, చింతపండు వెంకటేశ్వర్లు, లింగంపల్లి విజయ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిరిశెట్టి నర్సింహులు, మాజీ వైస్ ఎంపీపీ మహదేవుని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాట పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్ 10th, ఇంటర్, ఒకే సంవత్సరములో పూర్తి. Online ఎక్జామినేషన్ విధానం. D.Ed, B.Ed Fast Track అడ్మిషన్స్. ఇప్పుడు జరగబోయే TET, DSC కి అర్హులు. 7013108818 [Y_798371]

Wanted

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA24000542]

Services

అమ్మబడును

■ మునగాల గ్యాస్ ఏజెన్సీ అమ్మబడును. వెంటనే సంప్రదించండి. సెల్: 9032209690. [W-1264051]

డాక్యుమెంట్ పోయినది

■28-10-2024 తేదీన దేవరకొండ రూట్‌లో ఆటోలో వెళ్తుండగా యల్లా మణెమ్మ W/o చంద్రారెడ్డి, నల్లగొండ కి చెందిన 6731/2000 అను నెం. గల ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. దొరికినవారు సంప్రః సెల్: 9966614439 [Y-798487]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించ వలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిట్యాల: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గురువారం చిట్యాల ఎస్ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని (వయస్సు సుమారు 45 ఏళ్లు)విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పెద్దకాపర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి కంచర్ల గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సర్వారం పీఏసీఎస్ చైర్మన్‌ను తొలగించాలి

● రాజీనామా చేసేందుకు సిద్ధమైన పలువురు డైరెక్టర్లు

గరిడేపల్లి: మండల పరిధిలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డిని పదవి నుంచి తొలగించాలని పలువురు సంఘం డైరెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం వైస్ చైర్మన్ కృష్ణకుమారితో పాటు ఆరుగురు డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వారం పీఏసీఎస్ చైర్మన్ శంభిరెడ్డి గతంలో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో 77 వేల బస్తాల కుంభకోణం చేశారని ఆరోపించారు. రైతులకు ఎరువుల పంపిణీ విషయంలో కూడా నిర్లక్ష్యం వహించారని, ఇప్పటికీ గోదాంలో నాలుగు సంవత్సరాల క్రితం వచ్చిన 500 మందు బస్తాలు మగ్గుతున్నాయని తెలిపారు. సర్వారంలో గోదాం నిర్మాణంలో రూ.10లక్షల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. చైర్మన్‌తో పాటు మరో డైరెక్టర్‌తో కలిసి మిగిలిన వారికి తెలియకుండా ఈ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సంఘం కార్యాలయాన్ని నిర్మించకుండానే రైతులకు సంబంధించిన రూ. 2లక్షలు డ్రా చేశారని ఆరోపించారు. రైతులకు అందించాల్సిన రుణాలను చైర్మన్ తన బంధువులతో పేరుతో అనుచరులకు ఇప్పించారని అన్నారు. ఏడాది నుంచి డైరెక్టర్లతో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించకుండా చైర్మన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన చైర్మన్‌ని పదవి నుంచి తొలగించి సంఘాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఏడుగురు డైరెక్టర్లు రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గుమ్మడవెల్లి కృష్ణకుమారితో పాటు డైరెక్టర్లు పెండెం ముత్యాలు, మూలగుండ్ల సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, చంద్రారెడ్డి, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు అవాస్తవం..

ఇదే విషయమై చైర్మన్ శంభిరెడ్డిని వివరణ కోరగా.. తనపై చేసిన అవినీతి ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. ఏడాది క్రితం ఇలాంటి ఆరోపణలు చేసి అవిశ్వాసం పెట్టగా వీగిపోయిందని.. మరోసారి అవిశ్వాసం పెట్టగా అది కూడా వీగిపోవడంతో ఏం చేయాలో తెలియక గతంలోని ఆరోపణలనే మళ్లీ మళ్లీ చేస్తున్నారని వివరించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన అప్పటి సీఈఓ పరుశరాములును సస్పెండ్ చేసినట్లు తెలిపారు. చైర్మన్, డైరెక్టర్లు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని సంబంధిత అధికారులు విచారణలో నిగ్గు తేల్చారని అన్నారు. కొంత మంది డైరెక్టర్లు కావాలని రాజీనామా డ్రామా ఆడుతూ పాత ఆరోపణలే కొత్తదిగా చూపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరో మూడు నెలలు కాలమే పాలక వర్గానికి సమయం ఉందని, మూడు నెలల కోసం కుట్రలు కుతంత్రాలతో రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు.